దండాలు దండాలు అమ్మోరు తల్లో..

• కనులపండువగా చిత్తారమ్మ జాతర • డప్పు చప్పుళ్లమధ్య బోనాల ఊరేగింపు • ఒడి బియ్యం సమర్పించిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన చిత్తారమ్మ ఆలయ ప్రాంగణం

పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకం, డప్పు చప్పుళ్లమధ్య బోనాల ఊరేగింపుతో గాజులరామారం చిత్తారమ్మ జాతర శోభాయమానంగా మారింది. గాజులరామారంలో ఆదివారం జరిగిన చిత్తారమ్మ దేవి ప్రధాన జాతరకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి మూడు లక్షల మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఆలయానికి ఇరువైపుల కిలోమీటర్ భక్తుల క్యూలైన్ కనిపించింది. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. సాయంత్రం గాజులరామరం గ్రామం నుంచి అమ్మవారి రథం ఊరేగింపు కనులపండువగ సాగింది. జాతరకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలను హనుమంత్‌రెడ్డి, బాలనగర్ డీసీపీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, వివిధ ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాలానగర్ డీసీపీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

– సుభాష్‌నగర్


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తూ..


ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు




బోనాలతో కుటుంబ సమేతంగా..



చిత్తారమ్మ జాతరంటా..




అమ్మవారిని దర్శించుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్, మంజుల దంపతులు


ఒడి బియ్యం సమర్పిస్తున్న భక్తులు


జాతరలో సీసీ కెమెరాల ద్వారా కదలికలను పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది


బోనమెత్తిన మహిళలు

చిన్నాపెద్ద చిందులంటా..


శివసత్తుల నృత్యాలు




మొక్కులను చెల్లించుకునేందుకు వస్తున్న భక్తులు


చల్లంగా చూడమ్మ చిత్తారమ్మ అని మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

'కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుంది'


జీడిమెట్ల థర్మో కేబుల్ కంపెనీ వద్ద ఐఎన్‌టీయూసీ జెండాను ఎగురవేసిన నాగరాజు

కుత్బుల్లాపూర్: కార్మికులకు ఏ ఆపదొచ్చినా ఐఎన్‌టీయూసీ అండగా నిలుస్తుందని సంస్థ రాష్ట్ర నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మో కేబుల్ కంపెనీలో ఐఎన్‌టీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్మికుల పక్షపాతి అని అన్నారు. ఏప్రిల్‌లో జరిగే థర్మో కేబుల్ అగ్రిమెంట్‌ను కార్మికులకు లాభం చేకూరేలా రాష్ట్ర కార్మిక శాఖామంత్రి సహకారంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. చాలా ఏళ్ల తరువాత తాను సొంత గూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీనివాస్, దేవా, ఆనంద్, థర్మో కేబుల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆఫ్టర్ స్కూల్ ప్రోగామ్‌కు ముందుకు రావడం అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యవాణి

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆఫ్టర్ స్కూల్ ప్రోగామ్‌ను నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని నిజాంపేట్ 6వ డివిజన్ కార్పొరేటర్ సత్యవాణి అన్నారు. డాక్టర్ తోలేటి బుల్లి సోమేశ్వరరావు సౌజన్యంతో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక అంగన్వాడీ స్కూల్‌లో ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే వారికి ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు వారిలో సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగు పరిచేందుకు ఈ ఆఫ్టర్ స్కూల్ పోగ్రామ్‌లో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రగతినగర్‌లో ఇలాంటి మరో మూడు సెంటర్లను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటరామయ్య, వసుధ, బాలాజీ, మాజీ వార్డు సభ్యుడు రతన్‌రాజు, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ రాజకుమారి, రిటైర్డ్ ఎంఈఓ సంతోష్ కుమార్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు


మల్లు రవిని అభినందిస్తున్న భూపతిరెడ్డి

దుండిగల్: ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్‌లను ఆదివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి మర్యాదపూర్వకంగా కలిశారు. కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తప్పక గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన డీపీఎస్ అధినేత కొమురయ్య

కుత్బుల్లాపూర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత మల్కా కొమురయ్య ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం అయోధ్యలోని శ్రీరాముని ఆలయంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనున్న నేపథ్యంలో స్థానికంగా చేపట్టబోయే కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.

ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి


లూయీ బ్రెయిలీ భవనంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని లూయీ బ్రెయిలీ భవనంలో ఆదివారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ తెలంగాణ బ్రాంచ్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సూరారం కాలనీ సంయుక్త ఆధ్వర్యంలో లూయీబ్రెయిలీ 215వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో హెప్సిబా, సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, రిటైర్ లెక్చరర్ శ్రీహరి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ అధ్యక్షుడు వీసీ వీరరాఘవ లు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. చూపు లేకపోయినా లూయీ బ్రెయిలీ తోటి కనుచూపులేని వారికి కోసం బ్రెయిలీ లిపిని రూపొందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యాడు అధ్యక్షుడు అంజయ్యగౌడ్, బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పుణ్యం మల్లేశం, విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ ఎండీ షరీఫ్, ఎన్ఎఫ్‌బీ జనరల్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్‌గౌడ్, వ్యాడు సెక్రటరీ సత్యం, శేఖర్‌గౌడ్, జనరల్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు, సుధాకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

జగద్గిరిగుట్ట: ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాడి పెట్టుబడిదారి వ్యవస్థను తుదముట్టించిన ఘనత లెనిన్‌కే దక్కుతుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ... దేశంలో మత విద్వేశాన్ని రెచ్చగొట్టి కులం, మతం పేరుతో మనుషుల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. లెనిన్ ఆశయాలకు అనుగుణంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, నేతలు రాములు, హరినాథ్ రావు, డప్పు రామస్వామి, ప్రవీణ్, రాజు, కృష్ణ, వెంకట్‌రెడ్డి, బాబు, జానకీరామ్, ఇమామ్, ప్రభాకర్, శ్రీనివాస్ చారి, శివారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేకానంద్‌పై కేటీఆర్ ప్రశంసలు



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను అభినందిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కుత్బుల్లాపూర్: తెలంగాణ భవన్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన సాధించిన హాట్రిక్ విజయం చిరస్థాయిలో నిలిచిపోతుందని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తనను గెలిపించాయని, ఈ క్రెడిట్ అంతా కుత్బుల్లాపూర్ ప్రజలు, కేటీఆర్‌కే దక్కుతుందన్నారు.

◆ ఎల్డర్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన సెకండ్ ఇన్నింగ్ ఫ్యామిలీ ర్యాలీని ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సుమారు 70 కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు సరదాగా నెక్లెస్ రోడ్డు నుంచి గండిపేట్ వరకు ఈ ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డర్ కేర్ సెంటర్ నిర్వాహకులు మాధురి, గణేష్ ఆకెళ్ళ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం


భాగ్యలక్ష్మి కాలనీ నేతాజీ హైస్కూల్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సీఎంఆర్ ఆస్పత్రి వైద్య బృందం

కుత్బుల్లాపూర్: పాఠశాలల్లో కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చింతల మల్లేశం అన్నారు. ఆదివారం భాగ్యలక్ష్మి కాలనీలోని నేతాజీ హైస్కూల్‌లో నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎంఆర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోగులపాటి కృష్ణ మోహన్ మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ తక్కువై పోయిందని, అందుకే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు దృష్టి లోపాలపై అవగాహన, ఆరోగ్య వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో మొత్తం 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో నేతాజీ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మహేష్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, గురజాడ రంగారావు, శివభాస్కర్, సీఎంఆర్ కో ఆర్డినేటర్ రాజ్ నారాయణ, వైద్యులు వేణు,శిరీష, అనిల్, నేతాజీ హైస్కూల్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం.ప్రతాప్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ గ్రామంలో శివాత్మిక క్లినిక్ లాబొరేటరీస్ అండ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సాధారణ, బీపీ, డయాబెటీస్, కీళ్లు, పంటి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో శివాత్మిక క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటరమణ, వైద్యులు చంద్రశేఖర్ సోమ, మాధురి సోమ, హిమబిందు, రాఘవేంద్ర సోమ తదితరులు వైద్య సేవలు అందజేశారు.

పాఠశాలల్లో వసతులు మెరుగు పరుస్తాం


మాట్లాడుతున్న బీబీజీ కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌రావు

నిజాంపేట్: పాఠశాలల్లో వసతులు మెరుగు పరిచేందుకు భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూపు (బీబీజీ) కృషి చేస్తుందని సంస్థ కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలోని మండల ప్రజాపరిషత పాఠశాలకు బీబీజీ ఆధ్వర్యంలో మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. విజ్ఞానాన్ని ఎవరూ దొంగలించలేరన్నారు. బీబీజీ తరపున పాఠశాలకు అవసరమైన వసతులను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీబీజీ సభ్యులు లక్ష్మణకుమార్, జయబాబు, తులసి, కృష్ణమూర్తి, విద్యాసాగర్, మారుతీరామ్, సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు లాలయ్య, మహిళా విభాగ్ సభ్యురాలు సుగుణమ్మ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సత్యంకు ఉత్కృష్ట సేవా పతకం


కానిస్టేబుల్ సత్యానికి మెడల్ పెడుతున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

దుండిగల్: విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు దుండిగల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సత్యంకు కేంద్ర హోంశాఖ ఉత్కృష్ట సేవా పతకాన్ని అందజేసింది. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ అవినాష్ మహంతి ఉత్కృష్ట పథకాన్ని కానిస్టేబుల్ సత్యంకు అందజేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సీఐ శంకరయ్య, ఎస్సైలు, సిబ్బంది సత్యంకు శుభాకాంక్షలు తెలిపారు.